ఆర్టీసీ సమ్మె వాయిదా



భగత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులు మంగళవారం రాత్రి నుండి నిర్వహించాలనుకున్న సమ్మెను జేఏసీ నాయకులు వాయిదా వేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో హైదరాబాద్‌లో జరిగిన చర్చలు సఫలం కావడంతో సమ్మెను వాయిదా వేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు ప్రకటించారు.

ఎస్సారార్‌లో దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్



దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ

గణేశ్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): డిగ్రీలో అడ్మిషన్ పొందేందుకు దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ) నోటిఫికేషన్ ను ఉన్నత విద్యామండలి ఇటీవల విడుదల చేసింది. దోస్త్ ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియలో విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో దోస్త్ డిస్ట్రిక్ హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోస్త్ మొదటి విడత ఆన్‌లైన్ ప్రక్రియ మే 3 నుంచి ప్రారంభమై మే 21తో ముగుస్తుందన్నారు. 10 నుండి 22 వరకు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలలను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని, మే 29న మొదటి విడత అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. మే 30 నుంచి జూన్ 6వరకు సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్‌ను పూర్తి చేసుకోవాల్సి ఉంటుం దని తెలిపారు. విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ https://dost.cgg.gov.in ద్వారా అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి ఉంటుందన్నారు.

దోస్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ మాట్లాడుతూ అడ్మిషన్ల ప్రక్రియలో విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఎస్సారార్ కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఎదురైనా, ఎస్సారార్ కాలేజీలో అడ్మిషన్ల కోసం 8639940661, 9949394913 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె సురేందర్ రెడ్డి, కళాశాలవైస్ ప్రిన్సిపాల్స్ పి నితిన్, టి రాజయ్య, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డాక్టర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, దోస్త్ టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ వి శ్రీనివాస్, అధ్యాపకులు మేజర్ ఆర్ సంజీవ్, ఎం అంజనేయులు, ఎం వెంకటేశ్వర్లు, డాక్టర్ జె రమేష్, ఎ రాంకిషన్, జి రాజేందర్, టి అరవింద్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు



కరీంనగర్ స్పోర్ట్స్ మే 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకారంతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్నాయి. 13 నుంచి 23 సంవత్సరాల వయస్సు లోపు గల క్రీడాకారులు ఈ శిబిరాల్లో పాల్గొనవచ్చు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో రెండు, గోదావరిఖని, వేములవాడ, జగిత్యాలలో ఒక్కో శిబిరాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఒక్కో శిబిరంలో 120 నుంచి 150 మంది క్రీడాకారులకు శిక్షణను అందిస్తారు. కరీంనగర్‌లో శ్రవణ్ కుమార్, గోదావరిఖనిలో డి కిరణ్ కుమార్, వేములవాడలో పి రాజు, జగిత్యాలలో వి జలపతి శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు. జూన్ 6 వరకు నిర్వహించనున్న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ నిర్వహించనున్నామని ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమరావు, ఎన్ మురళీధర్‌రావు తెలిపారు. శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులకు గుడ్లు, పాలు, అరటిపండు అందించనున్నట్లు తెలిపారు.

'పురుమల్ల'పై సస్పెన్షన్ వేటు



- వెంటనే అమల్లోకి వస్తాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ ప్రకటన
- మంత్రి పొన్నంపై చేసిన వ్యాఖ్యలే కారణం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌పై ఆ పార్టీ క్రమశిక్షణ కమిటీ సస్పెన్షన్ వేటు వేసింది. వెంటనే ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని కమిటీ పేర్కొంది. జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వ్యతిరేకంగా పురుమల్ల శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు ఆయన సస్పెన్షన్‌కు దారితీశాయి. జనవరి మొదటి వారంలో పురుమల్ల డీసీసీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి తాను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నా తనకు తెలియకుండానే పదవుల నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. తాను నామినేటెడ్ పదవుల భర్తీ కోసం సూచించిన పేర్లను పక్కన పెడుతున్నారని అందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కారణమని పరోక్షంగా పేర్కొంటూ మాట్లాడి పార్టీలో కలకలం సృష్టించారు. ఈ ఎపిసోడ్ ఇప్పటికే ఆగిపోలేదు.. మరికొన్ని ఎపిసోడ్‌లు ఉంటాయంటూ సవాల్ విసిరారు. ఆ సందర్భంగా పురుమల్లకు వ్యతిరేకంగా పలువురు కాంగ్రెస్ నేతలు పార్టీ క్రమశిక్షణ కమిటీకి, టీపీసీసీకి ఫిర్యాదు చేసి ఆయనపై చర్యకు డిమాండ్ చేశారు.

● జనవరి 6న షోకాజ్ నోటీస్

జనవరి 6న క్రమశిక్షణ కమిటీ పురుమల్లకు షోకాజ్ నోటీస్ పంపించింది. దానికి శ్రీనివాస్ జనవరి 11న వివరణ పంపించారు. క్రమశిక్షణ కమిటీ నుంచి వివరణకు సంబంధించి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ వ్యవహారం ఇంతటితో ముగిసిందని భావించారు. ఉన్నట్టుండి మంగళవారం జనవరి 6న ఇచ్చిన షోకాజ్ నోటీస్‌కు 11న మీరు పంపించిన వివరణతో టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సంతృప్తి చెందలేదని, కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించామని పేర్కొంటూ పురుమల్ల శ్రీనివాస్‌కు సస్పెన్షన్ ఆదేశాలు పంపించింది. పార్టీ సహచరులతో మీ ప్రవర్తనను సరిదిద్దుకోవడానికి తగినంత సమయం ఇచ్చినా వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, అందుకే పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఈ ఆదేశాలు వెంటనే అమలులోకి వస్తాయని తెలిపింది. కమిటీ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ఈ ఆదేశాలను పురుమల్లకు పంపించారు.

● పార్టీ పెద్దల సమక్షంలోనే..

డీసీసీ కార్యాలయంలో జరిగిన సమావేశం తర్వాత పురుమల్ల శ్రీనివాస్ మంత్రి ప్రభాకర్‌కు దూరంగా ఉంటూ వస్తూ వ్యతిరేక శిబిరంగా కొనసాగుతున్నారు. ఇటీవల కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశాన్ని నిర్వహించగా ఆ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాట్లాడిన శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎంపీ విశ్వనాథన్ పెరుమాళ్, జిల్లా పరిశీలకులు నమిండ్ల శ్రీనివాస్, పి రఘునాథ్ రెడ్డి సమక్షంలోనే పురుమల్ల శ్రీనివాస్ తాము నామినేటెడ్ పదవుల విషయంలో ఏ ప్రతిపాదనలు టీపీసీసీకి పంపించినా ఒక దుర్మార్గుడు అడ్డుకుంటున్నాడని అన్నారు. ఇప్పటికి నాలుగైదు ప్రతిపాదనలకు అదేగతి పట్టిందని ఆయన చేసిన వ్యాఖ్యలు సమావేశంలో ఒకరినొకరు తోసేసుకునే పరిస్థితి ఉత్పన్నమయింది. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే దేవుళ్లని, అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవడంతో వారిలో అసంతృప్తి పెరిగిపోతున్నదని తెలిపారు. మంత్రిని టార్గెట్ చేస్తూ శ్రీనివాస్ మాట్లాడారని భావించిన ఆర్టీఏ సభ్యుడు పడాల రాహుల్, యూత్ కాంగ్రెస్ నాయకుడు బోనాల

(మిగతా 8వ పేజీలో)

భూ సమస్యలపై 562 దరఖాస్తులు

సైదాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): భూభారతి పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా సైదాపూర్ మండలంలోని ఆకునూర్, గొడిశాల గ్రామాలలో అధికారులు రెండు రోజులు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై 562 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. రెండో రోజు మంగళవారం గొడిశాల పరిధిలో 40, ఆకునూర్ పరిధిలో 252 దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతుల సహకారంతో గొడిశాల, ఆకునూర్ గ్రామాల్లో ప్రశాంతంగా రెవెన్యూ సదస్సులు ముగిశాయన్నారు. బుధ, గురువారం రాయికల్, ఎక్లాస్‌పూర్ గ్రామాల్లో గ్రామ సభలు ఉంటాయన్నారు. రైతులు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. రెవెన్యూ సదస్సులను అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ కనకయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్ పాల్గొన్నారు.

రూ. 7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు నలుగురు రైతులు 57 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,100 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

గణేష్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింలకు మేలు జరుగుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. వక్ఫ్ చట్ట సవరణ జన జాగరణ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ ఆధ్వర్యంలో కరీంనగర్ కోర్టు చౌరస్తా నుంచి తెలంగాణచౌక్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన చట్టంపై కొందరు అపోహతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టడం విచారకరమన్నారు. వక్ఫ్ సవరణ చట్టంపై మరికొందరు పనిగట్టుకుని అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డుతో ఇన్నేళ్లు అన్ని విధాల ప్రయోజనం పొందిన వారికి సవరణ చట్టం మింగుడు పడడం లేదన్నారు. నాడు కాంగ్రెస్ వక్ఫ్‌కు సర్వ హక్కులు కట్టబెట్టడం అనేక సమస్యలకు దారి తీసిందని విమర్శించారు. కార్యక్రమంలో జన జాగరణ అభియాన్ కన్వీనర్ తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కో కన్వీనర్ మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, శ్రీరాముల శ్రీకాంత్, శశిధర్‌రెడ్డి, పుప్పాల రఘు, నాగసముద్రం ప్రవీణ్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగసముద్రం ప్రవీణ్, సమీ పర్వేజ్, అశోక్, సంపత్, అనిల్, సాయి, అజయ్, మహేష్, రమేష్, ప్రసన్న పాల్గొన్నారు.



కరీంనగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

భాగ్యరెడ్డి వర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సుభాష్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): భాగ్యరెడ్డి వర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని మాల సంఘాల జేఏసీ చైర్మన్ బొగ్గుల మల్లేశం కోరారు. ఈ మేరకు మంగళవారం అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న భాగ్యరెడ్డి వర్మ జయంతి ఉందని తెలిపారు. నగరంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం సమీపంలోగల భాగ్యరెడ్డి వర్మ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని, రెయిలింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జయంతి కార్యక్రమానికి హాజరయ్యే వారి కోసం టెంట్లు, కుర్చీలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేడి అంజయ్య, దండి రవీందర్, మద్దెల రాజేందర్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌కి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అరచేతిలో ఆర్టీసీ సేవలు

● క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో అందుబాటులోకి

6

ఈదురుగాలులతో భారీ నష్టం

- నేల రాలిన మామిడి
- వర్షానికి తడిసిన ధాన్యం
- ఆందోళనలో రైతన్నలు



శంకరపట్నం మండలం ఇప్పలపల్లిలో నేల రాలిన మామిడి కాయలు



మానకొండూర్ మండలం అన్నారంలో నేలరాలిన మామిడి కాయలు



శంకరపట్నం మండలం తాడికల్‌లో విరిగిన విద్యుత్ స్తంభం

మానకొండూర్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఈదురు గాలులతో వడగళ్ల వాన కురిసింది. పెద్ద ఎత్తున మామిడి కాయలు నేల రాలాయి. మండలంలోని అన్నారం, పచ్చునూర్, లక్ష్మీపూర్, వెల్ది, చెంజర్ల, గంగిపల్లి, కొండపల్కల, వేగురుపల్లి, ఊటూర్, ముంజంపల్లి, మానకొండూర్ గ్రామాల్లో వెయ్యి ఎకరాలకు పైగా మామిడి తోటలు ఉన్నాయి. ఈసారి వాతావరణ పరిస్థితులు అనుకూలించి దిగుబడి వచ్చింది, కాయ మంచి ఆకారంతో కోత దశకు చేరుకున్న తరుణంలో ఈదురు గాలులు, వడగళ్ల వర్షానికి నేల రాలింది. ఒక్కొక్క తోటలో రెండు నుంచి నాలుగు టన్నుల వరకు మామిడి కాయ లు రాలిపోయాయిని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్కరికి 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు. అరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టారు. దీంతో ఆరబెట్టిన ధాన్యం అకాల వర్షానికి తడిసి పోగా రైతులు కవర్లను కప్పి తడవకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

తిమ్మాపూర్: మండల వ్యాప్తంగా సోమ వారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు ఈదురు గాలులతో వర్షం కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడంతో కొను గోలు కేంద్రాల్లో ఆరబె ట్టుకున్న ధాన్యం ఎక్కడ వర్షం పాలు అవుతుందో నని రైతులు ఆందోళన చెందారు. ధాన్యాన్ని కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పుకున్నారు. రామకృష్ణ కాలనీ, కొత్తపల్లి, నుస్తులాపూర్, మల్లాపూర్, పర్లపల్లిలో వర్షం కురి సింది. పలుచోట్ల ధాన్యం తడిసింది. నుస్తు లాపూర్, నల్లగొండలో మామిడి కాయలు నేల రాలాయి.

శంకరపట్నం: మండలంలో సోమ వారం రాత్రి ఈదురుగాలులతో కూ డిన వర్షం కురిసి భారీగా నష్టం వాటిల్లింది. మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. తాడికల్ ఏఈ సెక్షన్ పరిధిలో 33, ఆముదాలపల్లి ఏఈ సెక్షన్ పరిధిలో 20 విద్యుత్ స్తంభాలు ధ్వంస మైనట్లు ఏఈలు సంపత్‌రెడ్డి, రఘు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున విద్యు త్ సిబ్బంది లైన్‌లకు మరమతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. కోతకొచ్చిన మామిడి పంట నేలరాలి రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. మండలంలోని ఇప్పలపల్లి రాజాపూర్‌తో పాటు ఇతర గ్రామాల్లో మామిడి పంట పూర్తిగా రాలి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన చేస్తున్నారు. ఇప్పలపల్లిలో రైతు పాశం శ్రీధర్‌రెడ్డికి చెందిన మామిడి తోటలో గాలికి సుమారు 2.40లక్షల వరకు విలువ చేసే మామిడి కాయలు రాలాయి. రాజా పూర్‌లో చింతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, మా మిడి తోటలో 6లక్షల వరకు కన్నాపూర్‌లో గూడెపు సంతోష్‌రెడ్డి మామిడి పంట లక్ష వరకు నష్టం జరి గిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. ముత్తారం, మొలంగూర్, కేశవపట్నం, మెట్‌పల్లి గ్రామాల్లో గాలికి రేకుల షెడ్డు పై కప్పులు ఎగిరిపో యాయి. భారీ ఈదురుగాలులు, అకాల వర్షానికి వరి పంట నేలకొరిగింది. కొనుగోలు కేంద్రాల్లోని వరి, దాన్యం తడిసింది. మండల వ్యాప్తంగా భారీ వృక్షాలు, చెట్లు నేలకొరిగాయి.

అకాల వర్షాలతో విద్యుత్ శాఖకు రూ. ఐదు లక్షల నష్టం

- విరిగిపోయిన 40 విద్యుత్ స్తంభాలు

గణేశ్‌నగర్: రెండు రోజులుగా జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వీస్తున్న ఈదర గాలులకు విద్యుత్ శాఖకు ఐదు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని టీజీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. 40 విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయన్నారు. విద్యుత్ వినియోగదారులు వర్షాలకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.



శంకరపట్నం మండలం కేశవపట్నంలో మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం



తిమ్మాపూర్ మండలం మల్లాపూర్‌లో వర్షంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

అకాల వర్షంతో నష్టపోయాం

- పాకాల రాఘవరెడ్డి, అన్నారం



మూడు ఎకరాల మామిడి తోటలో ప్రతి చెట్టుకు మామిడి కాయలు ఆశించిన స్థాయిలో కాచాయి. ఈసారి మంచి ఆదాయం వస్తుందని ఆశ పడ్డాను. సోమవారం కురిసిన అకాల వర్షంతో రెండు టన్నుల వరకు కాయలు నేలరాలాయి. వీటికి మార్కెట్‌లో ఆశించిన ధర లభించదు. ప్రభుత్వం సర్వే చేయించి ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- రాచర్ల రామస్వామి, అన్నారం



అకాల వర్షంతో మామిడి నాకున్న రెండున్నర ఎకరాల మామిడి తోటలోని మామిడి కాయలు పూర్తిగా రాలిపోయాయి. చేతికి వచ్చే సమయంలో మామిడి కాయలు నేల రాలడంతో మామిడి రైతులు నష్టపోయారు. ప్రభుత్వం నష్టపోయిన పంటలను సర్వే చేపట్టి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

కన్నతల్లి కర్కశత్వం

- ప్రియుడితో కలిసి 15 రోజులుగా కుమారుడిపై దాడి
- చికిత్స పొందుతూ బాలుడి మృతి



అరుష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి): కన్నతల్లి, ఆమె ప్రియుడి కర్క శత్వానికి ఐదేళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన మంగళారపు అరుష్(5) అనే బాలుడు తల్లి, ఆమె ప్రియుడు కొట్టిన దెబ్బలకు స్పృహతప్పి పడిపోగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్ నగర్‌కు చెందిన మంగళారపు మాధవి, అరుణ్‌కుమార్‌లకు అరుష్(5), ఎనిమిదేళ్ల కూతురు ఉన్నారు. మాధవి భర్త అరుణ్‌కుమార్ పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తూ నాలుగేళ్ల క్రితం కిడ్నీలు ఫెయిలై మృతిచెందాడు. బీడీ కార్మికురాలిగా పనిచేసే మాధవి కొంత కాలంగా ఓ మెడికల్ షాప్‌లో సేల్స్ ఉమెన్‌గా పనిచేస్తోంది. నాలుగు నెలల క్రితం అదే మెడికల్ షాప్‌లో పనిచేసే సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో ఉంటున్న సామాల బాలకిషన్‌తో పరిచయం ఏర్పడింది. ఇటీవలనే ఇద్దరు పిల్లలతో కలిసి మాధవి సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటలోని అద్దె ఇంట్లోకి మకాం మార్చింది. తల్లి మాధవి, ఆమె ప్రియుడు బాలకిషన్‌లు 15 రోజులుగా కుమారుడు అరుష్(5)పై దాడిచేసి కొడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాలుడు అరుష్ తలకు గాయమై స్పృహ తప్పి పడిపోయాడు. దీంతో తల్లి, ఆమె ప్రియుడు ఇద్దరు కలిసి స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించినప్పటికీ బాలుడు స్పృహలోకి రాకపోవడంతో పరిస్థితి విషమించిందని వైద్యులు తెలుపడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. బాలుడి తాత లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గంజాయి కేసులో యువకుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్పీ మహేశ్ బి గితె

సిరిసిల్ల క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న సిరిసిల్ల పట్టణానికి చెందిన మహ్మద్ అహ్మద్(23) అనే యువకుడిని అరెస్ట్ చేశామని ఎస్పీ మహేశ్ బి. గితె తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్లకు చెందిన అహ్మద్‌పై 15 గంజాయి కేసులు నమోదయ్యాయని, 5 కేసుల్లో పరారీలో ఉన్నాడన్నారు. జిల్లాలోని సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, బోయిన్‌పల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్లలో నమోదైన 15కేసుల్లో సిరిసిల్ల టౌన్‌లో 4, చందుర్తిలో 1 కేసులో పరారీలో ఉన్నాడన్నారు. దీంతో అహ్మద్ సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ చౌరస్తా వద్ద ఉన్నట్లు తెలుసుకున్న టౌన్ సీఐ కె. కృష్ణ వెళ్లి అరెస్ట్‌చేసి విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అరికట్టడానికి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి పోలీసులు వినూత్న కార్యక్రమాలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లాలో గంజాయి విక్రయించినా, సాగుచేసినా, అక్రమ రవాణా చేసినా 8712656392కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

గంగాధర, మే 6 (ఆంధ్రజ్యోతి) : గంగాధర మండలం ఆచంపల్లిలో 12 ట్రాక్టర్ల ఇసుక డంపులను గుర్తించినట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. గ్రామంలో అక్రమంగా ఇసుక డంపు చేసినట్లు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 12 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించినట్లు ఆమె తెలిపారు. తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు.

అరచేతిలో ఆర్టీసీ సేవలు

క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో అందుబాటులోకి



ఆర్టీసీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యూఆర్‌కోడ్ కీచైన్‌లు

భగత్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులకు చేరువయ్యేందుకు పలు సేవలను అందుబాటులోకి తీసుకు వస్తున్నది. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యాప్‌ల ద్వారా ప్రయాణికులు ఈ సేవలు పొందవచ్చు.

కొత్త తరహాలో..

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించింది. ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే పలు రకాల యాప్‌ల ద్వారా ఆర్టీసీ సేవలు వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ బస్ బుకింగ్, టికెట్ బుకింగ్, గమ్యం, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్ యాప్‌లు ఉంటాయి. గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్‌కు ఆండ్రాయిడ్, ఐవోఎస్ వినియోగదారులకు ఉపయోగపడేలా వేర్వేరు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ సాయంతో ప్రయాణికుల వివరాలు పొందుపరిస్తే ఆర్టీసీ సేవలు వినియోగించుకోవచ్చు.

సేవల వివరాలు...

మనం ప్రయాణించాల్సిన బస్సు ఎక్కడుందో, మన వాళ్లు వస్తున్న బస్సు ఎక్కడి వరకు వచ్చిందో, ఎంత సమయం పట్టవచ్చు, గమ్యస్థానం ఎంత సేపటిలో చేరుతారో గమ్యం యాప్ ద్వారా తెలుసు కోవచ్చు. రాష్ట్రంలో నడుస్తున్న బస్సుల వివరాలు, సమాచారాన్ని సైతం అందుబాటులో ఉంచారు. సలహాలు సూచనలే కాకుండా ఆన్‌లైన్‌లో మనకు కావాల్సిన చోటుకి టికెట్స్ రిజర్వు చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నది. ఆర్టీసీ సేవలపై ఎలాంటి ఫిర్యాదులున్నా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, ఎక్స్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వివాహాది శుభకార్యాలతో పాటు విహార యాత్రలకు బస్సులను రాయితీ విధానంలో యాప్‌ల ద్వారా తక్కువ ధరకే బుక్ చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నది.

ఆర్టీసీని ఆదరించండి
బి రాజు, రీజినల్ మేనేజర్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు ప్రయాణీకులకు మరింత చేరువయ్యే విధంగా క్యూఆర్ కోడ్ రూపకల్పన చేసింది. ప్రయాణీకులు కీ చైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆర్టీసీ సమాచారం అందుబాటులోకి వస్తుంది. యాప్‌ల ద్వారా అందిస్తున్న ఆర్టీసీ సేవలను ప్రయాణీకులు వినియోగించుకుని ఆర్టీసీ ఆదరించాలి.

కీ చైన్‌ల ద్వారా ప్రచారం...

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌లు ముద్రించిన కీ చైన్‌లను తయారు చేసింది. కీ చైన్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఆర్టీసీ సేవలన్నీ అందుబాటులోకి వస్తాయి. కీచైన్‌లను ప్రయాణీకులకు వివిధ రూపాల్లో అందించేందుకు ఆర్టీసీ ఏర్పాట్లు చేస్తోంది.

ఐదుగురిపై అదనపు కట్నం కేసు

జమ్మికుంట రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): అదనపు వరకట్నం కోసం అత్తింటి వారు వేదిస్తున్నారని బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం ఐదుగురిపై కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన గాజనేని రవళికి ఇల్లందకుంట మండలం రాచపల్లికి చెందిన ఉమ్మనవేణి మహేష్‌కు గత ఏడాది ఫిబ్రవరి 11న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. ఐదు లక్షల నగదు, తొమ్మిది తులాల బంగారం, ఇతర పెట్టుపోతలతో ఘణంగా పెళ్లి జరిపించారు. రెండు నెలలు బాగానే ఉన్న మహేష్ తరుచూ మద్యం సేవిస్తూ అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టాడు. భర్తతో పాటు అత్త ప్రమీల, మామ మల్లయ్య, ఆడపడుచు మౌనిక, ఆమె భర్త మల్లేష్ సైతం వేధిస్తున్నారని బాధితురాలు ఇచ్చిన పిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

రియల్ ఎస్టేట్ పేరుతో రూ.93లక్షల మోసం

● పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ ● కేసు నమోదు

జమ్మికుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో రియల్ ఎస్టేట్ పేరుతో ఓ మహిళ వద్ద రూ.93లక్షలు తీసుకు ని మోసం చేసిన ఓ వ్యక్తిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. జమ్మి కుంటకు చెందిన పోనగంటి కావ్యకు అదే జమ్మికుంటకు చెందిన మ్యానకొండ సాయి కిరణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పరిచయం అయ్యాడు. తక్కువ ధరకు ప్లాట్లు, భూమి ఇప్పిస్తానని చెప్పి విడుతల వారీగా రూ.93 లక్షలు తీసుకున్నాడు. ప్లాట్, భూమి ఎక్కడ అని అడిగితే ఇన్ని రోజులు దాటవేసుకుంటూ వచ్చాడు. లాభం లేదని గ్రహించిన సదరు మహిళ గట్టిగా నిలదీయడంతో నీ అంతు చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో వరి ధాన్యం దగ్ధం

మంథనిరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెంద గ్రామంలో మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరెపల్లి సాంబయ్య అనే రైతుకు చెందిన వరి పంట కుప్ప దగ్ధమైంది. మూడున్నర ఎకరాల్లో సాంబయ్య మేల్, ఫిమేల్ సాగు చేశాడు. చేతికి వచ్చిన పంటను కోసి కల్లంలో కుప్ప వేయగా మంటలు అంటుకున్నాయి. విషయాన్ని మంథని ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ శివశంకర్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్ప టికే పంట దగ్ధమైంది. సుమారు రూ.5 లక్షల వరకు పంట నష్టం జరినట్లు అంచనా వేస్తున్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని హుస్సేన్‌మియా వాగు పరివాహక ప్రాంతంలోని పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యలకు నిప్పు అంటించారు. దీంతో రైతు జంగా రాజయ్యకు చెంది న ఎకరం 10గుంటల బాస్మతి వరికుప్ప, కొరకండ్ల శ్రీనివాస్‌రెడ్డికి చెందిన 28గుంటల బాస్మతి వరికుప్ప కాలి బూడిదైంది. వరి కొయ్యకాలు కాలబెట్టడం వలన పక్కనే ఉన్న వరి పొలానికి మంటలు అంటు కోవడంతో చుట్టుపక్కల రైతులు ఆర్పివేశారు.



ఆరెందలో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

మండల కేంద్రంలో హుస్సేన్‌మియావాగు పక్కన యరబాటి రాజేశ్వర్‌రావుకు చెందిన మూడు ఎక రాల ఆయిల్ పామ్ తోట అగ్నికి ఆహుతైంది. మంగ ళవారం గుర్తుతెలియని రైతులు కోసిన వరిపొలం కొయ్యకాలు తగలబెట్టడంతో మంటలు వ్యాపించి ఆయిల్‌పామ్ తోటతోపాటు డ్రిప్పు కూడా కాలి పోయింది. రూ. 40వేల నష్టం జరిగింది.

రైలు ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

ఓదెల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ గేటు సమీపంలో మంగళవారం రైలు ఢీకొని ఇదే గ్రామానికి చెందిన కాంతాల లక్ష్మి (70) అనే వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో ఉన్న బంధువుల ఇంటికి బస్సులో వెళ్లేందుకు రైల్వేలైన్ దాటుతోంది. ఈ క్రమంలో రైలు ఢీకొనడంతో లక్ష్మి మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం జీఆర్‌పి. హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు.

కాట్రపల్లిలో ఎలుగుబంటి సంచారం

హుజురాబాద్ రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఎలుబంటి సంచారంతో గ్రామస్థులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామ శివారులోని కుందేళ్ల గుట్ట సమీపంలో ఎలుగుబంటి పిల్లలతో సంచరిస్తూ మంగళవారం గ్రామస్థులకు కంటపడటంతో వారు వెంటనే పరుగులు పెట్టారు. ఎలుగుబంటి సంచరిస్తుండటంతో గ్రామస్థులు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఎలుగుబంటి సమస్యను పరిష్కరించాలని మాజీ సర్పంచ్ తొగరు భిక్షపతి, బిట్ల శ్రీకాంత్, గ్రామస్థులు కోరుతున్నారు.

పాతకక్షలతో దాడి

జగిత్యాలరూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాల ముకుందంపై పాతకక్షలు మనసులో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ముద్దసాని గంగాధర్ కర్రతో దాడిచేసి గాయపరిచినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. బాలముకుందంకు, ముద్దసాని గంగాధర్‌లకు గత కొన్ని రోజులుగా గ్రామ అభివృద్ధితో పాటుగా గ్రామ కంఠం, రోడ్డునిర్మాణాలకు సంబంధించి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో బాలముకుందంపై కోపం పెంచుకున్న ముద్దసాని గంగాదర్ మంగళవారం ఉదయం సమయంలో గ్రామ పంచాయితీవద్ద ఉన్న బాలముకుందంపై వెనుకవైపు నుంచి కర్రతో దాడిచేసి గాయపర్చాడు. తీవ్రగాయాలైన బాలముకుందంను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వెనుకవైపు వెన్నుబాగం లోపల బలమైన గాయాలు కాగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆస్పత్రిలో బాలముకుందంను పరామర్శించారు. కారణాలను తెలుసుకున్నారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు

మెట్‌పల్లి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి రూరల్ మండలంలోని వెల్లుల్ల, రామచంద్రంపేట గ్రామాల్లో తాళం వేసి ఉన్న నాలుగు ఇళ్లలో సోమవారం రాత్రి చోరీలు జరిగాయి. మంగళవారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రంపేటలోని అల్లిక సంజన అనే వివాహిత నెల రోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో మంగళవారం ఉదయం పక్కింటి వారు ఫోన్ ద్వారా ఆమెకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసేసరికి రూ.4వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. గ్రామంలోని పుల్లూరి గంగమణి ఇంటికి తాళం వేసి నాలుగు రోజుల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. ఇంటి తాళం పగలగొట్టి ఉండడంతో సమాచారం అందుకొని వచ్చి చూసేసరికి ఇంట్లోని రూ.10వేలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. వెల్లుల్ల గ్రామానికి చెందిన బొడ్డు లింగాధర్, పెండం నరేందర్ కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల క్రితం తిరుపతి టూర్ వెళ్లారు. వారి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి ఉండేసరికి పక్కింటి వారు సమాచారం అందించారు. బాధితుల బంధువులు చూసేసరికి పెండం నరేందర్ ఇంట్లో రూ.10వేల నగదు చోరీ అయినట్లు గుర్తించారు. సీఐ అనిల్‌కుమార్, ఎస్సై కిరణ్‌కుమార్‌లు చోరీలు జరిగిన ఇళ్లను పరిశీలించి క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేములవాడ : వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్‌లోని తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగింది. స్థానికంగా ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న తాటికొండ సంతోష్ కుటుంబ సభ్యులతో కలిసి ఐదు రోజుల క్రితం విహారయాత్రకు వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం సభ్యులు వేలిముద్రలను సేకరించారు. సుమారు 25 వేల నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అభివృద్ధి పేరుతో రాజన్న ఆలయాన్ని మూసివేయడం సరికాదు

వేములవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి పేరిట జూన్ నెల నుంచి మూసివేయాలని అధికారులు నిర్ణయించడం సరికాదని వేములవాడకు చెందిన పలువురు పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నిమిత్తం దేవస్థానాన్ని జూన్ 15 నుంచి మూసివేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం పద్మశాలి సంఘం భవనంలో వివిధ వర్గాలకు చెందిన పలువురు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రాజన్న రక్షణ సమితి ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అభివృద్ధి పేరిట దేవాలయాన్ని మూసివేయాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 14వ తేదీన వేములవాడ బంద్ పాటించాలని నిర్ణయించారు. అభివృద్ధి, విస్తరణ కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయాన్ని మూసివేస్తాం అంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న అనుబంధ ఆలయాలను తొలగించినా ఊరుకొనేది లేదన్నారు. రాజన్న ఆలయం ఆగమశాస్త్రం ప్రకారం లేదని అధికారులు చెబుతున్నారని, ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ ఆవరణలో దర్గా ఉండవచ్చా అని ప్రశ్నించారు. కేవలం 76 కోట్ల రూపాయలతో మాత్రమే పనులు పూర్తవుతాయా అని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం రాజన్న ఆలయాన్ని మూసివేస్తారని ప్రచారం జరగడంతో స్థానికులతో పాటు భక్తులు కూడా తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉజ్జయిని, కాశీ, అయోధ్య లాంటి ఆలయాలు మూసి వేయకుండానే అభివృద్ధి చేశారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

ఇదిలా ఉండగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సమావేశంలో పాల్గొన్న వారిని ఉద్దేశిస్తూ ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నాడని, ఇట్లాంటి పరిస్థితుల్లో అభివృద్ధి పేరిట ఆలయాన్ని మూసివేయడం సరైనది కాదని అన్నారు. వేములవాడ రాజ న్న రక్షణ సమితి చేసే ప్రతి కార్యక్రమానికి అండగా ఉంటానని బండి సంజయ్ కుమార్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయ కుడు ప్రతాప రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్, కుమ్మరి శంకర్, సంటి అంజిబాబు, రేగుల మల్లికార్జున్, గోపు బాలరాజు, మోటూరి మధుసూదన్, పిన్నింటి హనుమాన్లు, కటకం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రం మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి

- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవనంలో మంగళవారం పట్టణ మహాసభలను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవిల ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ జెండాను సీనియర్ మహిళా నాయకురాలు సుంకరపెల్లి శాంతాబాయ్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలకు ముఖ్యఅతిథిగా జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎంలో పని చేసిన ఏలిగేటి రాజశేఖర్, షకీల్‌తోపాటు ఎనిమిది మంది నాయకులు చాడ వెంకట్‌రెడ్డి సమక్షంలో సీపీఐలో చేరగా వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, సీపీఐ నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ఎర్రజెండా కార్మికుల పోరాటాలు, ఆవేదన కష్టాల నుంచి పుట్టిన జెండా ఎర్ర జెండా అన్నారు. 1925లో పరిపాలన వలసవాదులైన నైజాం పాలకుల చేతిలో ఉండేదని, అప్పుడు ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ హక్కులు ఏమీలేవన్నారు. ఆనాటి దుస్థితి నుంచి తెలంగాణలో రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దూం మోయిన్, తెలంగాణ సాయుధ పోరాటం చేసి నైజాం పాలకులను గద్దెదించిన చరిత్ర అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం లేకపోతే నైజాం గద్దె దిగేవాడే కాదని ఇది ముమ్మాటికీ వాస్తవం అని అన్నారు. అలాంటి పోరాటంలో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ఉండడం గర్వకారణం అన్నారు. ఇప్పటికీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆగడాలని పెంచి పోషిస్తూ హిందూ దేశమని ముద్ర వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. భారతదేశంలో విభిన్న మతాలు సంస్కృతులు సంప్రదాయాలు, భాషలు భావాలు నిలయంగా ఉన్న దేశం అన్నారు. కార్మికులు పోరాటం చేసి 44 చట్టాలను సాధించుకుంటే కార్మికులు సమ్మె చేసే హక్కును హరిస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ పూర్తిగా కాలేదని, అంగన్‌వాడీలకు, ఆశాలకు, మధ్యాహ్నం భోజనం కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై కార్మిక సంఘాలు పోరాటం చేయడానికి సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. మహాసభల్లో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మణ్, అనసూర్య, కుర్ర రాకేష్, కేవి అనసూయ, అజ్జ వేణు పాల్గొన్నారు



సిరిసిల్లలో సీపీఐ పట్టణ మహాసభలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

ఆస్తిలో వాటా కోసం ఆందోళన



జఫరోద్దీన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది

జగిత్యాల అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): అత్తగారి పేరు మీద ఉన్న ఆస్తిని తన మామ ముగ్గురు కూతుళ్లు ఉండగా రెండో కూతురు పేరున రిజిస్ట్రేషన్ చేశారని జగిత్యాల మున్సిపల్‌లో ఆందోళనకు దిగిన ఓ యువకుడు తలను బీరువాకేసి కొట్టుకోవడంతో స్పృహ కోల్పోయాడు. వివరాలలోకి వెళితే..జగిత్యాలకు చెందిన అప్సరీ బేగం అహ్మద్‌ఖాన్ దంపతులకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. అప్సరీ బేగం మరణించగా ఆమె భర్త అహ్మద్‌ఖాన్ తన భార్య పేరుపై ఉన్న ఆస్తిని రెండో కూతురుకు రిజిస్ట్రేషన్ చేశాడు. దీనిపై అహ్మద్‌ఖాన్ అల్లుడు జఫరోద్దీన్ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆందోళన చేపట్టాడు. తలను బీరువాకు కొట్టుకోవడంతో స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న మున్సిపల్ సిబ్బంది వెంటనే జఫరోద్దీన్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

నెలలోపే మహిళా కమిషన్ ఫిర్యాదుల పరిష్కారం

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద



కొండగట్టులో పూజలు నిర్వహిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద దంపతులు

మల్యాల, మే 6(ఆంధ్రజ్యోతి): మహిళా కమిషన్‌కు వచ్చే ఫిర్యాదులను నెల రోజులలోపే పరిష్కారం చేసే దిశగా ముందుకు వెళ్తున్నట్లు రాష్ట్ర మహిళా కమిషన్ చైరపర్సన్ నేరెళ్ల శారద తెలిపారు. మంగళవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని కుటుంబసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గతంలో కన్న ఇప్పుడు కమిషన్‌కు ఫిర్యాదులు పెరిగిపోయాయని వాటికి కౌన్సెలింగ్ ఇస్తూ పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. సహజీవనం ఫిర్యాదులు అనేకం వస్తున్నాయన్నారు. ఆకర్షణ, ప్రేమ తదితర కారణాలతో సహజీవనం చేయడం సమాజానికి, వ్యక్తిగతంగా మంచిది కాదన్నారు. ఇటీవల మగవాళ్ల వైపు నుంచి కూడా ఫిర్యాదులు వస్తుండడంతో వాటికి కూడా కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు నేరెళ్ల శారద పేర్కొన్నారు.

కొండగట్టు ఆలయ అభివృద్ధిపై చర్చిస్తాం

కొండగట్టు ఆలయం అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించనున్నట్లు నేరెళ్ల శారద అన్నారు. కొండగట్టు ఆలయ అభివృద్ధి, వసతి తదితర సౌకర్యాల కోసం ప్రభుత్వం తరుపున కృషి చేస్తామని తెలిపారు. టీటీడీ వంద గదుల నిర్మాణంపై ఏపీ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళతామని శారద పేర్కొన్నారు.

భూసేకరణ పనులు వేగంగా చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- 80 అడుగుల మేరకు రోడ్డు వెడల్పు
- ఆందోళనకు దిగిన నిర్వాసితులు



వేములవాడలో భూ సేకరణ సర్వే పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మూల వాగు నుంచి రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ పట్టణంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణకు సంబంధించిన భూసేకరణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పునకు 50ఏళ్లుగా ఆటంకాలు ఎదురవుతున్నాయని, అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని, ఈసారి ఖచ్చితంగా 80 ఫీట్ల మేరకు రోడ్డును విస్తరించి తీరుతామని కలెక్టర్ స్పష్టం చేశారు. రోడ్డు వెడల్పులో నష్టపోయే ఇళ్ల యజమానులకు నష్టపరిహారం చెల్లించేందుకు 47కోట్ల 80 లక్షల రూపాయలు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. రోడ్డు వెడల్పు నిర్వాసితులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని, నష్టపరిహారం కింద గజానికి 30వేల రూపాయలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు.

80 ఫీట్ల మేరకు రోడ్డును విస్తరించేందుకు రోడ్డుకు మార్కింగ్ జరుగుతోందని, ఈమేరకు 315 ఇళ్లలో 257 ఇళ్లకు సంబంధించిన సర్వేను ఇంజనీరింగ్ అధికారులతో కూడిన నాలుగు బృందాలు పూర్తిచేశాయని, మిగతా సర్వే వేగంగా పూర్తి చేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు తమకు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తిచేసి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే అవార్డులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, మున్సిపల్, ఆర్అండ్బీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. రోడ్డు వెడల్పునకు సంబంధించిన సర్వే నిర్వహించకుండా హైకోర్టు స్టే మంజూరు చేసిందంటూ పలువురు ఇళ్ల యజమానులు అధికారులను అడ్డుకున్నారు. అయితే హైకోర్టు కేవలం నాలుగు ఇళ్లకు సంబంధించి మాత్రమే ఆదేశాలు జారీ చేసిందని, మిగతా ఇళ్లకు సంబంధించిన సర్వేను పూర్తిచేస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో రోడ్ల వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళనకు దిగారు.



రాజన్న ఆలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఇళ్ల యజమానులు

మదర్ ఆఫ్ గేమ్స్.. అథ్లెటిక్స్

రన్, త్రో, జంప్, వాక్‌ల కలయిక

నేడు వరల్డ్ అథ్లెటిక్స్ డే









కరీంనగర్ స్పోర్ట్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్‌ను మదర్ ఆఫ్ గేమ్స్ అని కూడా పిలుస్తారు. వ్యక్తిలోని శక్తి సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఇందులోని అంశాలు వేదికగా నిలుస్తాయి. ఒలింపిక్స్‌లో అథ్లెటిక్స్‌కు ప్రత్యేక గుర్తింపు. అథ్లెటిక్స్‌లోని రన్, త్రో, వాక్, జంప్ వంటి ఆటలు వ్యక్తి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయి. మనిషి ఆరోగ్యంగా ఉంటే ప్రపంచం ఆరోగ్యంగా ఉంటుందనే నానుడిని నిజం చేయాలని 1996లో తొలిసారిగా ప్రపంచ అథ్లెటిక్స్ డేను ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ప్రారంభించింది.

చిన్నాపెద్ద వయోభేదం లేకుండా సర్వ మానవాళి ఆరోగ్యంగా ఉండాలనేది ప్రపంచ అథ్లెటిక్స్ డే ప్రధాన లక్ష్యం. అథ్లెటిక్స్ ఫర్ ఏ బెటర్ వరల్డ్ అనేది ఐఏఏఎఫ్ ప్రధాన నినాదం. ప్రపంచవ్యాప్తంగా విద్యార్థులు, యువత క్రీడల్లో పాల్గొన డానికి, ఫిట్‌నెస్ ముఖ్యం. ఇందులో భాగం గా ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఏటా మే 7వ తేదీన ప్రపంచ అథ్లెటిక్స్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్‌లో పాల్గొనేలా యువతను ప్రోత్సహించడం ఈ దినోత్సవం ప్రాథమిక లక్ష్యం.

అథ్లెటిక్స్‌లో రాణించాలంటే

శారీరక దారుఢ్యానికి తోడు నిర్దిష్టమైన ఎత్తు, బరువు ఉన్న విద్యార్థులు, యువత అథ్లెటిక్స్‌లో రాణిస్తారు. 12 ఏళ్ల వయస్సు నుంచి శిక్షణ మొదలుపెడితే భవిష్యత్‌లో రాణించ గలుగుతారు. శిక్షణకంటే ముందు విద్యార్థుల శరీరాకృతి, శక్తి సామర్థ్యాలను అంచనావేసి ఏ అంశానికి సరిపోతారన్నది గుర్తించాలి. ఇందుకు కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయుల సహకారం తీసుకోవాలి. దృఢమైన శరీరం గలవారు స్ప్రింటర్లుగా, ఎత్తుగా ఉండి ఛాతి లోపలికి ఉన్నవారు లాంగ్ డిస్టెన్స్ రన్నర్స్‌గా, బల ప్రదర్శనలో ముందుండేవారు త్రోలో రాణిస్తారు.

అథ్లెటిక్స్‌లోని అంశాలు

పరుగు: 100, 200, 400 మీటర్ల షార్ట్ డిస్టెన్స్ రన్, 800, 1500 మీటర్ల మిడిల్ డిస్టెన్స్ రన్, 3000 మీటర్ల స్టీపుల్ చెస్ పరుగు.


త్రోస్: జావెలిన్ త్రో, షాట్‌పుట్, డిస్కస్ త్రో, హ్యామర్ త్రో.

జంప్: హైజంప్, లాంగ్ జంప్, పోల్ వాల్ట్, ట్రిపుల్ జంప్.

కంబైన్డ్ అంశాలు: ట్రైయాతలాన్, పెంటతలాన్, హెప్టాథ్లాన్, డెకథ్లాన్.

జిల్లాలో ఆదరణ

జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అథ్లెటిక్స్ ఆదరణ ఉంది. కరీంనగర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నందెల్లి మహిపాల్, కడారి రవి వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో జిల్లాలో ఏటా అథ్లెటిక్స్ పోటీలను జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలోని రుక్మాపూర్, జమ్మికుంట, హుజూరాబాద్, మేడిపల్లి, కోహెడ, హుస్నాబాద్, కరీంనగర్, శనిగరం, గంగాధర, దాచారం, చొప్పదండి, చింతకుంట, మానకొండూర్ తదితర ప్రాంతాల నుంచి ఎందరో అథ్లెటిక్‌లు వెలుగులోకి వచ్చారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారు.



వ్యాయామ ఉపాధ్యాయులుగా

గతంలో జాతీయస్థాయి అథ్లెటిక్స్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన కడారి రవి, శ్రీనివాస్, డి.శ్రీనివాస్, హరికిషన్, కె.సమ్మయ్య, చంద్రశేఖర్, బాబు శ్రీనివాస్, బి.రాజగోపాల్ చారి, డాక్టర్ ఇజాజ్ అహ్మద్ వ్యాయామ ఉపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. వీరి ఆధ్వర్యంలో నూతన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారు.

జిల్లాలో అథ్లెటిక్స్ అభివృద్ధికి కృషి

నందెల్లి మహిపాల్, అథ్లెటిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు



జిల్లాలో అథ్లెటిక్స్‌కు విశేష ఆదరణ లభిస్తుంది. జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభచాటుతున్నారు. పలు ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. జిల్లాలో అథ్లెటిక్స్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు భత్యాలతోపాటు క్రీడా దుస్తులను అందిస్తున్నాం. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నాం.

సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి

కడారి రవి, అథ్లెటిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



జిల్లాలో అథ్లెటిక్స్ నిర్వహణకు అంబేద్కర్ స్టేడియంలోని మైదానంలో సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. క్రీడా పాఠశాలలో ఏర్పాటు చేసినా దూరంగా ఉండడంతో నగర క్రీడాకారులు ఆ ట్రాక్‌పై శిక్షణ పొందేందుకు కష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నా స్పాన్సర్ అవసరం ఉంది. జిల్లా అథ్లెట్స్ ఆర్మీ, రైల్వే, పోలీస్ ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు.

కొండగట్టుకు పోటెత్తిన భక్తులు

మల్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధానం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. ఇరవై వేలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. జైజంక్షన్, పార్కింగ్ ప్రాంతంలో సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

కూలిన చలువ పందిళ్లు

కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కోనేరు పక్క నుంచి పాత కార్యాలయానికి వెళ్లే మార్గంలో చలువపందిళ్లు కూలి భక్తులు ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి వీచిన గాలి దుమారానికి పం దిళ్లు పడిపోగా వాటి కింద పడుకున్న భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మంగళవారం వేలాదిగా భక్తులు తరలి వస్తారని తెలిసీ కూలిన పందిళ్లను కనీసం సరిచేయించకపోవడం పట్ల భక్తులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



కొండగట్టు ఆలయ ఆవరణలో భక్తులు

బద్దిపోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడలోని బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం తెల్లవారు జామున అమ్మవారికి మట్టి పాత్రల్లో నైవేద్యాన్ని వండుకుని నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల నృత్యాలతో భక్తులు ఊరేగింపుగా బద్ది పోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. పట్నాలు వేసి అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. అనంతరం నైవేద్యం, కల్లుసాక పెడుతూ పిల్లాపాపలు, పాడి పంటలను చల్లంగా చూడమ్మ బద్దిపోచమ్మ తల్లీ అంటూ భక్తులు వేడుకున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



బద్దిపోచమ్మ ఆలయం లోపల భక్తులు

బహుముఖ ప్రజ్ఞాశాలి స్వామి

- రచయిత, నటుడు, గాయకుడిగా రాణింపు
- సింగరేణిలో పదవీ విరమణ
- ప్రజా పాటల ప్రస్థానానికి అర్ధశతాబ్దం



పాట రికార్డింగ్‌లో కవ్వంపల్లి స్వామి

కోల్‌సిటీటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రచయితగా, నటుడిగా, గాయకుడిగా సింగరేణి కార్మిక క్షేత్రంలో రాణిస్తున్నాడు కవ్వంపల్లి స్వామి. అర్ధశతాబ్దంగా కళారంగంలో, ఉద్యమాల్లో తన కలంతో పాటలకు ప్రాణం పోశాడు. ప్రజా నాట్యమండలి కళాకారుడిగా ప్రజల్లో, కార్మికుల్లో చెరగని ముద్ర వేసున్నాడు స్వామి.

గోదావరిఖనికి చెందిన కవ్వంపల్లి స్వామి బహుముఖ ప్రజ్ఞతో యాభైఏళ్లుగా ప్రజా కళాకారుడిగా సేవలందిస్తున్నారు. స్వగ్రామం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు. స్వామి తండ్రి వెంకటయ్య సింగరేణి కార్మికుడు కావడంతో గోదావరిఖనిలోనే స్వామి విద్యాభ్యాసం సాగింది. అనంతరం సింగరేణిలో క్యాజువల్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూనే కళాకారుడిగా తన గళాన్ని వినిపించాడు. స్పెషల్ గ్రేడ్ క్లర్క్‌గా 2019లో పదవీవిరమణ చేశారు. విద్యార్థి దశ నుంచి అప్పటి కార్మిక నాయకుడు దివంగత మాదిరెడ్డి భాస్కర్‌రావు ప్రోత్సాహంతో 1973లో ప్రజా నాట్యమండలిలో చేరాడు.

1974లో విజయవాడలో జరిగిన రాష్ట్ర మహాసభలకు హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచి సీపీఐ-ప్రజా సంఘాల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పదవులు నిర్వహించి ప్రస్తుతం ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ జాతీయ సమితి సభ్యుడిగా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రజా గాయక బృందంలో ప్రధాన గాయకుడు స్వామి. నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు శిక్షణా శిబిరాలు నిర్వహించి కళాకారులను ప్రోత్సహించాడు. నాటి సినీనటులు సి.నాగభూషణం, నల్లూరి వెంకటేశ్వర్లు, కందిమళ్ల ప్రతాపరెడ్డిల నాయకత్వంలో వందేమాతరం శ్రీనివాస్‌తో కలిసి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అక్కో అక్కో అక్కా... సూడు మల్లేశా..., ఏమి రాజ్యం ఎన్నియల్లో, కూలినాలీ నాలన్నలారా, సింగరేణి కార్మికా వంటి గీతాలు స్వామి కలం, గొంతు నుంచే జాలువారినవే. కళా ప్రదర్శల్లోనే కాకుండా క్యాసెట్లు, సిడిల్లో స్వామి పాటలు రికార్డయ్యాయి. 1978లో ఆలిండియా రేడియో కార్మికుల కార్యక్రమంలో స్వామి పాటలు ప్రసారమయ్యాయి. కోలిండియా స్థాయిలో 25సార్లు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అందరి మన్ననలు అందుకున్నారు. గీత్, భజన్ ఈవెంట్లలో బహుమతులు పొంది సింగరేణికి ఖ్యాతిని తీసుకువచ్చారు. ప్రజాకవి వంగపండు రాసిన భూబాగోతం, నృత్యనాటికకు నేపథ్యగానం అందించారు. ఈ నృత్య నాటికను 1982లో దాదర్, వర్లీ(బొంబాయి)లోని తెలుగు ప్రజల మధ్య ప్రదర్శించారు.

అంతా ఒక్కటే, ఉక్కుపిడికిళ్ళు, తూర్పు వంటి రంగస్థల నాటికలతో పాటు వీధినాటికలు కాలేరోళ్ళు, సీసపద్యం మొదలైన వాటిలో ప్రదర్శించడంతోపాటు వీటిలో నటించడం ద్వారా స్వామికి గుర్తింపును తీసుకువచ్చాయి.

రచయితగా రాసిన గేయాల్లో కొన్ని...



దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తితో స్వామి

- నేలతల్లినే నమ్ముకొని రైతన్నా...
- బిరబిర బీడీలు చుట్టే ఓ అక్కా...
- నల్లా బంగారానికి నష్టమెట్లవచ్చెరా...
- వీధుల వెంట ....రమేషా...సురేషా...
- ఎడారి దేశంలో నీబతుకు ఎడారే తమ్మీ...
- మల్లెపల్లి రాజమా... పల్లె ఎర్రమల్లెవు...
- సిరిసంపదలు గల్ల సిరిసిల్ల పట్నంలో...
- జొన్నల మల్యాల బిడ్డ జోహార్లు బానయ్య

" వీధుల వెంట...గల్లీ పొంట రమేషా... సురేషా అనే పాట జోష్ సినిమాకి జోష్ నిచ్చింది.

2012లో తెలంగాణ కోసం గద్దర్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ నాయకత్వాన సాగిన గోలేటి నుంచి కొత్తగూడెం వరకు బాయి నుంచి బాయికి కార్యక్రమంలో 15 రోజుల పాటు సాంస్కృతిక దళానికి స్వామి నాయకత్వం వహించారు.

పాటకు పర్యాయపదంగా...

రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన సీడీల్లో స్వామి పాటలు దేశం కోసం, ఎర్రజెండా నీడలో, రణభేరి, ఢంకానాదం, ఎర్రకుంకుమ మొదలైన క్యాసెట్లు(సీడీలు)లో స్వామిగళమెత్తారు. కాలేరోళ్ళు, సీసపద్యం నాటికలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాస్థాయిలో ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఆర్. నారా యణమూర్తి పోరు తెలంగాణ సినిమాలో నటించడంతోపాటు మా భూమి, ఆయుధం నాటకాలను సింగరేణి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రదర్శన ఇవ్వడంలో ప్రముఖ పాత్ర పోషించారు.

సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్ ప్రభుత్వంపై అనుమానాలు

- తమ భవిష్యత్తు ఏమిటోననే ఆందోళనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు
- తెలంగాణ ప్రజానీకానికి ధైర్యం నింపే సీఎం ఇలా మాట్లాడడం దుర్మార్గం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు పెద్దలా భావించే సీఎం స్వయంగా నాతో ఏం కాదు.. నేనేం చేయలేని స్థితిలో ఉన్న.. రాష్ట్రం దివాలా తీసింది.. అప్పు పుట్ట లేదు.. అణా పైసా ఎవ్వలిత్తలేరు.. బ్యాంకులకు పోతే దొంగోని లెక్క చూస్తున్నరు.. అంటూ వ్యాఖ్యానించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటదా..? ఉండదా..? అనే అనుమానాలు తెలంగాణ సమాజంలో తలెత్తుతున్నాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి ధైర్యం నింపే సీఎం ఇలా మాట్లాడడం దౌర్భాగ్యం.. సిగ్గుచేటని అన్నారు. ఆయన మాటలతో దేశవ్యాప్త చర్చ సాగుతోందని, తమ భవిష్యత్తు ఏమిటోననే ఆందోళనలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పడిపోయారని పేర్కొన్నారు. ఢిల్లీకి వెళ్లి ప్రధా ని, కేంద్ర మంత్రులను కలిశానని రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తున్నారని అక్కడ అభినందనలు తెలుపుతూ ఇక్కడ తనకు అపాయింట్‌మెంటు ఇవ్వట్లేదని సీఎం అబద్ధాలు చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

ఢిల్లీకి పోతే చెప్పులెత్తుకుపోయే టోని లెక్క చూస్తుండ్రని, ఆ కల్చర్ కాంగ్రెస్‌లో ఉంటుంది కావచ్చని అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం అప్పుల పాలైందని, కేసీఆర్ రూ.7 లక్షల కోట్లు అప్పుల పాలు, అధోగతి చేసిండ్రని ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు, మేం చెప్పినమని అన్నారు. ఎలక్షన్లప్పుడు డబుల్ ఇంజన్ సర్కారు రావాలని కోరినం, ప్రజలను ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేసినం.. ప్రజలేం చేసిండ్రు.. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని మీరు చెప్పితే నమ్మి ఓట్లేసిండ్రని అన్నారు. యేడాదిలోనే అప్పులు తీర్చడంతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని పేర్కొంటూ అనేక ప్రాంతాల్లో బాండు పేపర్లు రాసిచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు సమాధానం చెప్పాలని ప్రజలు నిలదీస్తారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆ రహదారిని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయడం కోసం సిద్ధంగా ఉన్నామని 2022లోనే ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని విరమించుకోకుండా కేంద్ర ప్రభుత్వంపై బురద జల్లే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాహుల్, ప్రియాంకగాంధీలు సంవిధాన్‌పై ప్రతిజ్ఞ చేసి చెప్పాలి

తెలంగాణలో జరిగిన గత ఎన్నికల్లో సంవిధాన్ పుస్తకం చేత పట్టుకుని కేసీఆర్ అప్పులు చేశారు మేం తీర్చుతాం.. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామంటూ రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు ప్రతిజ్ఞ చేసి పోయింత్రు.. అదే సంవిధాన్ బుక్ పట్టుకుని రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలు తెలంగాణ రాష్ట్రానికి రావాలని, ప్రజలను మేం సమీకరించి బహిరంగ సభను పెడ్తాం.. ప్రజలు అడిగే ప్రశ్నలకు ప్రతిజ్ఞ చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటాలు వాస్తవమేనని అంగీకరించగలరా..? అని ప్రశ్నించారు. దేశంలో ఉగ్ర, తీవ్ర వాదాన్ని తుద ముట్టించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. తుపాకీ ద్వారా సాధించేది ఏమీ లేదని అన్నారు. కర్రెగుట్టల్లో మావోలపై 'ఆపరేషన్ కగార్' పేరిట కేంద్ర బలగాలు వేట సాగిస్తుండడం పట్ల మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలు రెండు నాల్కల ధోరణిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. అమాయకులైన ఆదివాసీలు, ప్రజలను పొట్టపెట్టుకుంటున్న వారికి మద్దతు పలకడం ఏం నీతి అని ప్రశ్నించారు. మావోలపై నిషేధం ఎత్తివేసే దమ్ము సీఎంకు ఉందో చెప్పాలని డిమాండ్ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సంజయ్

ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ప్రజలు ఘనస్వాగతం పలికారు.పారిశుధ్య కార్మికులను మంత్రి బండి సంజయ్ సన్మానించారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలోని సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐలు రమాకాంత్, లక్ష్మణ్, ప్రత్యేక పోలీసులు భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, నాయకులు తిరుపతి, బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, శంకర్, మల్లేశం, మల్లారెడ్డి, నరేశ్, కిరణ్ నాయక్, గాల్‌రెడ్డి, రాజిరెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

కరీంనగర్ రూరల్ సీఐగా నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 6 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ సీఐగా ఎ.నిరంజన్‌రెడ్డి నియామకమయ్యారు. ఇప్పటి వరకు రూరల్ సీఐగా పనిచేసిన ప్రదీప్ కుమార్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. మల్టీ జోన్-1లో తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ సోమవారం ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ జోనల్ కమిటీ

భగత్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎస్సీ, ఎస్టీ, వెల్ఫేర్ జోనల్ స్థాయి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జోనల్ అధ్యక్షుడిగా యూఆర్ కృష్ణ, జోనల్ కార్యదర్శిగా ఎస్.లచ్చిరామ్ నాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎల్.ప్రకాష్ నాయక్, జోనల్ కోశాధికారిగా జి.లక్ష్మి, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మధూకర్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు రీజినల్ మేనేజర్‌ను కలిశారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, రీజియన్ కార్యదర్శి దొంత రాజయ్య, రీజినల్ ఛైర్మన్ ఎన్‌కే రాజు, కోశాధికారి రజనీకుమార్ పాల్గొన్నారు.

12న వేంకటేశ్వరస్వామి కల్యాణం

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 6 : నగరంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం 10-30 గంటలకు భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో కందుల సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి సహస్రదీపాలంకరణ, గరుడ వాహన సేవలుంటాయని పేర్కొన్నారు. కల్యాణ దాతలుగా కూర్చునేవారు ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

పరిహారం ఇప్పించాలి

భగత్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుతో నష్టపోయిన తమకు పరిహారం ఇప్పించాలని రేకుర్తిలోని జలిగం కనకలక్ష్మి కోరారు. మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. సోమవారం రాత్రి రేకుర్తి లోని గౌడ్స్ కాలనీలోని తమ ఇంటిపై పిడుగు పడిందని, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు దెబ్బతిన్నాయన్నారు.

పాకిస్థానీయులపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పాకిస్థానీయులను బహిష్కరించిందని, వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లాలో మంగళవారం తహసీల్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. బీజేపీ కొత్తపల్లి జోన్ అధ్యక్షుడు హరీష్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

బీజేపీ నాయకులు కొత్తపల్లి అర్బన్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జోన్ కన్వీనర్ జాడి బాల్‌రెడ్డి, నార్త్ జోన్ అధ్యక్షుడు పాదం శివరాజు, సౌత్‌జోన్ అధ్యక్షురాలు గాయత్రిదేవి, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు సాయికృష్ణ, లక్ష్మారెడ్డి, ఎన్నంప్రకాశ్, బండ రమణారెడ్డి, శానగొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో మంగళవారం భారత్‌లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీయులు వెళ్లిపోవాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సమర్పించారు.

శంకరపట్నం: బీజేపీ మండలాధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి ఉన్నారు.

రామడుగు: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, మండల ప్రధాన కార్యదర్శి పోచం పెల్లి నరేష్ పాల్గొన్నారు.

మానకొండూర్: పాకిస్థానీయులను తరిమి కొట్టాలని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు మండల అధ్యక్షులు రాజిరెడ్డి, అప్పని తిరుపతి, శ్రీనివాస్ ఉన్నారు.

ఇల్లందకుంట: బీజేపీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట రూరల్: బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొలకాని రాజు తహసీల్దార్ రాజుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆకుల రాజేందర్, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకూర్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించాలి

గణేశ్‌నగర్,మే 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ అశోక్ అన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కరీంనగర్ సర్కిల్ మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు వినియోగదారులకు జాగ్రత్తలు వివరించాలన్నారు. అంతకుముందు భద్రత వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. పర్యవేక్షక ఇంజనీర రమేష్ బాబు, డీఈలు ఉపేందర్, రాజం, ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య పాల్గొన్నారు.



వారోత్సవాల్లో చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ అశోక్

ఆస్తమా వ్యాధి కాదు.. అలర్జీ మాత్రమే

సుభాష్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): ఆస్తమా అనేది వ్యాధి కాదని అలర్జీ మాత్రమేనని మెడికవర్ ఆస్పత్రి పల్మనాలజిస్టు డాక్టర్ రవీంద్రాచారి అన్నారు. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. దగ్గు, ఆయాసం, ఆలర్జీ ఇవి మాత్రమే ఆస్తమా లక్షణాలని.. ఆస్తమా చిన్న పిల్లలకే కాదు పెద్దవాళ్లకు కూడా వస్తుందని అన్నారు. ఆస్తమా అంటువ్యాధి కాదని, దుమ్ము, చల్లగాలి ద్వారా మాత్రమే ఊపిరితిత్తులు రియాక్షన్ అవుతాయిని తెలిపారు. ఆస్తమా వచ్చినవారు జీవితాంతం మందులు వాడాల్సిన అవసరం లేదని, సకాలంలో గుర్తిస్తే నయం సులువని అన్నారు. ఆస్తమాను వ్యాధిలాగా కాకుండా అలర్జీగా మాత్రమే చూడాలన్నారు. ఆస్తమాకు మందులు వాడితే పిల్లలకు పుట్టరనే అపోహలను నమ్మకూడదన్నారు. వ్యాక్సినేషన్‌తో కూడా ఆస్తమాను పూర్తిగా దూరం చేయవచ్చన్నారు. మాట్లాడుతూ మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ నాగరాజు, డాక్టర్ లోకేష్, సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలి

గణేశ్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల్లో యువజన సంఘాలను, యువజన అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేయాలని జిల్లా యువజన, రాష్ట్ర, జాతీయ అవార్డు గ్రహీతలు కోరారు. మంగళవారం నెహ్రూ యువ కేంద్రం కార్యాలయంలో నెహ్రూ యువ కేంద్రం అధికారి వెంకటరాంబాబుకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేసేందుకు యువజన సంఘాల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. జాతీయ యువజన అవార్డు గ్రహీతలు కిరణ్ కుమార్, రెండ్ల కళింగ శేఖర్, అలవాల విష్ణు, కొండా రవి, మహ్మద్ అజమ్, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత సత్తినేని శ్రీనివాస్, జాతీయ కోర్డినేటర్ యాదవ రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

సుభాష్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, వడగండ్ల వాన, గాలి దుమారంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం నగరంలోని ముఖ్య నాయకులతో కలిసి వివిధ మండలాలను తిరిగి రైతులతో మాట్లాడి పంటనష్టంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. కళ్లాల్లో, కొనుగోలు సెంటర్ల వద్ద ఉంచిన ధాన్యం తడిసిందని తెలిపారు.

హుజూరాబాద్: అకాల వర్షంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతు, ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పొన్నంకు అభినందనలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు చొరవ చూపిన శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జిల్లాలోని వివిధ క్రీడా సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా వేసవిలో క్రీడా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈసారి గడువు సమీపిస్తున్నా నగరపాలక సంస్థ క్రీడా శిక్షణ కార్యక్రమాల నిర్వహణపై ప్రకటన చేయలేదు. ఇటీవల జిల్లా యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి సమ్మర్ క్యాంపుల నిర్వహణ ఆవశ్యకత గురించి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు.

'పురుమల్ల'పై సస్పెన్షన్ వేటు

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాస్ తదితరులు పురుమల్లను అడ్డుకుంటూ ఆ దుర్మార్గుడెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక దశలో వేదికపైనే ఒకరినొకరు తోసుకుంటూ తీవ్ర గందరగోళ పరిస్థితిని సృష్టించడంతో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి వారందరిని స్టేజీ కిందకు నెట్టేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్ తన సమక్షంలో జరిగిన ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా పరిగణిస్తూ క్రమశిక్షణ ఉల్లంఘించిన వారిపై చర్యలుంటాయని, క్రమశిక్షణ తప్పేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అదే వేదికపై హెచ్చరించారు. ఏఐసీసీ కార్యదర్శి, పార్టీ పరిశీలకులు హాజరైన సమావేశంలో ఈ గొడవకు కారణమైన పురుమల్ల శ్రీనివాస్‌పై వేటు తప్పదనే అభిప్రాయం వ్యక్తమయింది. ఈ సంఘటన తర్వాత కూడా పలువురు టీపీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే క్రమశిక్షణ కమిటీ పురుమల్ల శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

విద్యార్థికి ఆర్థిక చేయూత



విద్యార్థిని శతాక్షికి టికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్ అర్బన్/ మే 6(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్తున్న విద్యార్థినికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్థిక చేయూతనందించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం బూరుగుపల్లికి చెందిన గడ్డం శతాక్షికి లండన్‌లోని గ్రీన్‌విచ్ యూనివర్సిటీలో ఉన్నత చదువులకు అవకాశం వచ్చింది. శతాక్షికి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పేద రైతు కుటుంబం. ఆమె తండ్రి కాంగ్రెస్‌లో క్రియాశీలక కార్యకర్తగా పనిచేశారు. విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శతాక్షిని అభినందించారు. సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన రూ. 70 వేల విలువైన విమాన టికెట్‌ను అందజేశారు.

కొనసాగుతున్న ఆలయాల బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 6 : స్థానిక భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్‌లోని సముదాయ ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆంజేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, ధర్మకర్తలు సత్యనారాయణ, శ్రీనివాస్, కవిత, ఆనంద్‌రెడ్డి, కృష్ణ ఈవో కొన్న కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దోస్త్' ఆన్‌లైన్ సహాయ కేంద్రం

గణేశ్‌నగర్, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ (స్వయం ప్రతిపత్తి) కళాశాలలో చేరనున్న విద్యార్థుల కోసం ఉచిత ఆన్‌లైన్ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ వరలక్ష్మి తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీఏ, బీకాంలో కోర్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం రూ.200 చెల్లించాలని, ఉచిత ఆన్‌లైన్ సెంటర్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొదటి విడత ఈనెల 21 వరకు, వెబ్ ఆప్షన్ ఈనెల 22 వరకు చేసుకోవచ్చని వివరించారు. మొదటి విడత సీట్ల వివరాలను 29న విడుదల చేస్తారని తెలిపారు. సందేహాలు ఉంటే కళాశాలలోని బాల సుబ్రమణ్యం, 9963599266 నంబరులో సంప్రదించాలని సూచించారు.

భారత్ పాకిస్థాన్ యుద్ధ వాతావరణం

సుభాష్‌నగర్, మే 6(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్ పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొందని ప్రజామిత్ర ప్రోగ్రెసీవ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నగరంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పాకిస్తాన్ ఉగ్రవాద ఎగుమతి దేశంగా మారిపోయిందన్నారు. వందల సంఖ్యలో ఉగ్రవాద శిక్షణ కేంద్రాలను నడిపిస్తోందని ఆరోపించారు. భారత్‌ను అస్థిరపరచడానికి కొన్ని అంతర్జాతీయ శక్తులు, మరికొన్ని దేశాలు పాకిస్తాన్‌కు అండగా నిలుస్తున్నాయన్నారు.

దేశ భద్రత కోసం మహా మృత్యుంజయ పారాయణం

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 6: భారత్-పాక్ మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కరీంనగర్‌కు చెందిన గీతాభక్త సమాజం సభ్యులు దేశ భద్రత-సైన్యం రక్షణను కాంక్షిస్తూ కోటి మహా మృత్యుంజయ పారాయణం ప్రారంభించారు. ఇటీవల ఆధ్యాత్మిక, ధార్మిక, సామూహిక పూజా కార్యక్రమాల్లో కరపత్రాలు పంచి అందరితోనూ పారాయణం చేయిస్తున్నారు. ఈ విషయాన్ని రాష్ట్రపతి, ప్రధాని, ఉప ప్రధాని, హోం, రక్షణ శాఖ మంత్రులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి సంజయ్‌కి ట్విట్టర్ ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా చైతన్యపురి మహాశక్తి దేవాలయంలో మంగళవారం సభ్యులను కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అభినందించారు. న్యూఢిల్లీలో తన కార్యాలయంలో ఈ అంశం నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు బండ సత్తయ్య, ఉప్పల రామేశం, చిట్టిమల్ల దామోదర్, ఎల్ల చిన్న వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను చూపుతున్న బండి సంజయ్‌కుమార్

రేపటి నుంచి సుందరగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అర్చకులు

చిగురుమామిడి,మే 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి 16 వరకు నిర్వహించనున్న సుందరగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర హౌస్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, దేవాలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య, ఆలయ ఈవో రాజ్‌కుమార్, క్లర్క్ బుట్ల కవిత, ఎలగందుల లక్ష్మణ్, జీల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి : ఏవో

శంకరపట్నం, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు గుర్తింపు కార్డు కోసం ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేష్ అన్నారు. మంగళవారం శంకరపట్నంలో రైతు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందాలంటే ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదార్ పాసు పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నంబర్ తీసుకొని తమకు కేటాయించిన తేదీల్లో ఆయా గ్రామాల్లో మండల వ్యవసాయవిస్తరణాధికారులను కలిసి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

షానగర్‌లో విద్యుత్ భద్రతపై అవగాహన

రామడుగు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని షానగర్‌లో ఏడీఈ సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన గుండి సబ్ డివిజన్ పరిధిలోగల విద్యుత్ ఉద్యోగులకు విద్యుత్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఈ మేక రమేష్‌బాబు హాజరై మాట్లాడారు. రామడుగు, చొప్పదండి, గంగాధర మండలాలకు సంబంధించిన విద్యుత్ ఉద్యోగులు డీఈఎం తిరుపతి, డివిజనల్ స్థానిక ఏఈ కమలేశ్వర్ పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చిగురుమామిడి, మే 6(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు తక్షణమే పరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి, సుందరగిరి, ఉల్లంపల్లి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో సీపీఐ బృందం దెబ్బతిన్న పంటలను, లేచిపోయిన రేకుల షెడ్లను పరిశీలించి మాట్లాడారు.

మానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవం

గన్నేరువరం: మండలంలోని ఖాసింపేటలో వెలసిన స్వయంభూ మానసాదేవి ఆలయ సప్తమ వార్షికోత్సవం ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నేరువరం, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజీ, గునుకుల కొండాపూర్, తుమ్మనిపల్లి, మోత్కులపల్లి గ్రామాలకు బుధవారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకింద చెట్లు తొలగిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులు, యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలి

● రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

రామడుగు, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, యువత పుస్తక పఠనం అవర్చుకోవాలని, తద్వారా జ్ఞానం పెంపొందుతుందని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. రామడుగు మండలం వెదిరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితాన్ని చక్కగా మలుచుకునేందుకు పుస్తకం ఉపకరిస్తుందని అన్నారు. వెదిర సహా రామడుగు మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని వివరించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తక పఠనానికి ప్రత్యేక గదులు కేటాయిస్తున్నామని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పుస్తక పఠనాన్ని అందరూ అలవర్చుకోవాని అన్నారు. ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన వెదిరకు చెందిన కోరుకొండ పల్లవి, ప్రణీతలను సన్మానించారు. లైబ్రరీ ఏర్పాటు చేసిన కేరళకు చెందిన విద్యార్థిని ఆకర్షనను సత్కరించారు.



వెదిరలో మాట్లాడుతున్న నేరెళ్ల శారద

కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంఈవో వేణు కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల తిరుపతి, ప్రధానోపాధ్యాయులు రాజమౌళి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

గంగాధర, మే 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మంగళవారం గంగాధర మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతలు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. కేంద్రాల్లో టార్పాలిన్లు లేక వర్షాలకు ఎండిన ధాన్యం తడుస్తుందన్నారు. గోనె సంచులు, లారీలు లేక కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని అన్నారు. కొనుగోలు చేసిన రైతుల డబ్బులను సకాలంలో అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట తాజా మాజీ సర్పంచ్‌లు విజేందర్‌రెడ్డి, గంగాధర్, మల్లేశం, నాయకులు మహిపాల్‌రావు, సురేందర్, రమేష్, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పదవుల భర్తీలో సమతుల్యత పాటిస్తాం

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 6, (ఆంధ్రజ్యోతి): త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేపట్టబోయే పదవుల భర్తీలో అన్ని కులాలను పరిగణలోకి తీసుకొని సమతుల్యత పాటిస్తామని, నియామకల్లో యువతకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. బ్లాక్, మండల పార్టీ అధ్యక్ష పదవులకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ పరిశీలకులు నామిండ్ల శ్రీనివాస్, పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదగోని లక్ష్మి నారాయణగౌడ్, ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారి రమేష్, రవీంద్ర చారి పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న కవ్వంపల్లి

కాంగ్రెస్‌లో చేరికలు

తిమ్మాపూర్ : నుస్తులాపూర్ సింగల్ విండో చైర్మన్ గుజ్జుల రవీందర్‌రెడ్డి, రామకృష్ణ కాలనీ తాజా మాజీ సర్పంచ్ మీసాల అంజయ్య, గొల్లపల్లి తాజా మాజీ సర్పంచ్ మల్లెత్తుల అంజయ్య యాదవ్, రామకృష్ణకాలనీ మాజీ ఉపసర్పంచ్ గుజ్జుల ప్రణీత్‌రెడ్డి తదితరులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గంగాధర, మే 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం గంగాధర మండలం వెంకటయ్యపల్లి ఫంక్షన్ హాల్లో చొప్పదండి నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ చొప్పదండి గడ్డ రుణం తీర్చుకునే అవకాశం ఇచ్చిన కార్యకర్తలకు, ప్రజలకు వెన్నంటి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో అబ్బుర్వర్లు శ్రీనివాస్, పద్మాకర్‌రెడ్డి,అంజన్‌కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, గంగాధర, రామడుగు, బోయినపల్లి, చొప్ప దండి ఏఎంసీ చైర్మన్‌లు జాగిరపు రజిత, తిరుమల, ఎల్లేశ్, మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు వోడ్నాల యగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

● చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని రైతులు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండలం వెంకంపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, నాయకులు భైరి సంపత్ తదితరులున్నారు.

● సంక్షిప్తం

జమ్మికుంట: మే 20న జరుగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్‌కు మంగళవారం కార్మికసంఘ నాయకులు సమ్మె నోటీస్ అందజేశారు.

- జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బమల్లిఖార్జునస్వామి ఆలయం చుట్టూ లైటింగ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆలయ ప్రధాన పూజారులు మంగళవారం కమిషనర్ మహమ్మద్ ఆయాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆలయ ప్రధాన పూజారులు మేడిపల్లి వెంకన్న, మేడిపల్లి ఓదెలు, మేడిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి : గ్రామాల్లోకి మత్తు పదార్థాలు రాకుండా మహిళా సంఘ సభ్యులు ఐక్యంగా ఉండాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కో-ఆర్డినేటర్ డ్యాగల సారయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్లంపల్లిలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్రను ప్రారంభించారు. సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ గ్రామాల్లో పోరుయాత్ర సాగింది. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, చెప్యాల ప్రకాష్ తదితరులు ఉన్నారు.

వీణవంక: వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామంలో ప్రొబెషన్ ఎస్ఐ సాయికృష్ణ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 22న కరీంనగర్‌లో జరిగే హిందూ ఏక్తా యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయానికి పులి లత-ఆంజనేయులుగౌడ్ దంపతులు లక్షా 116 రూపాయల విరాళం అందించారు.

గన్నేరువరం: నూతనంగా బాధ్యతలను చేపట్టిన గన్నేరువరం తహసీల్దార్ జక్కని నరేందర్‌ను మాజీ సర్పంచ్ పుల్లెల లక్ష్మి లక్ష్మణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

తిమ్మాపూర్: నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీనివాస్‌ను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు బండారి రమేష్, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.